క్లుప్తంగా

శివాలయంలో పూజలు



ప్రత్యేక అలంకారంలో శివలింగం

సుండుపల్లె : మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో వెలసినటువంటి శ్రీవిరూపాక్షేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి, అయ్యప్పస్వామి, లక్ష్మీనరసింహస్వాముల విగ్రహాలను భక్తులు పూలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పూజారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

హార్సిలీహిల్స్ టోల్ వసూళ్లలో రికార్డు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఎంట్రీ రుసుము రికార్డు స్థాయిలో వసూలైంది. ఈ రుసుము వసూళ్ల ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచాయి. ఇంత వరకు వసూలు కానంతంగా దసరా సెలవుల ముగింపు చివరి రోజులు శని, ఆదివారాల్లో వసూలైంది. శనివారం రూ.33,510 వసూలైతే ఆదివారం రూ.35,450 వసూలైంది. దసరా సెలవులు వారాంతం కావడంతో ఈ స్థాయిలో ఆదాయం వచ్చింది.

వర్షాలపై డీటీ సమీక్ష

సిద్దవటం : మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న నివాస గృహాల సమాచారాన్ని వీఆర్ఓలు వెంటనే తెలపాలని డిప్యూటీ తహసీల్దారు మాధవీలత అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన గృహ నిర్మాణదారులు స్థానిక గ్రామ సచివాలయంలో వీఆర్ఓలకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే వర్షాల కారణంగా పంట పొలాలు దెబ్బతిని ఉంటే ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని ఆమె అన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేద్దాం

రాయచోటి (జగదాంబసెంటర్) : ఈ నెల 17న జరిగే వాల్మీకి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గువ్వల యోగానంద్‌బాబు(బుజ్జి) విజ్ఞప్తి చేశారు. రాయచోటి పట్టణంలోని బంగ్లా సమీపంలో ఏడాది క్రితం అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్కడనే ఈ సారి వేడుకలను నిర్వహించదలిచామన్నారు. రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని ప్రకటించడం హర్షణీయమన్నారు. వాల్మీకులకు ప్రత్యేకంగా అప్పటి జగన్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమానికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 17వ తేదీ ఉదయం 8.30 గంటలకు జిల్లాలోని వాల్మీకి సోదరులందరూ తప్పక హాజరుకావాలని ఆయన విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



దుకాణాదారుతో మాట్లాడుతున్న ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రతి షాపు వద్దకు వెళ్లి మీ షాపు భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి అని సూచించారు. అలాగే షాపు ముందు వాహనాలు నిలపకుండా చూసుకోవాల్సిన జాగ్రత్త దుకాణ యజమానులపై ఉందన్నారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉంచితే వాహనదారులతో పాటు మీరూ బాధ్యులవుతారన్నారు. అనంతరం వాహనాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూక్లియర్ నిర్వహణపై అవగాహన



శ్రీనివాసులరెడ్డి, సైంటిస్టు

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో న్యూక్లియర్ ప్రయోజనాల నిర్వహణ రహిత ట్రాన్స్‌ఫార్మర్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌కు చెన్నై సైంటిస్టు బి.శ్రీనివాసులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూక్లియర్ విద్యుత్ ప్లాంట్‌లో ఉపయోగించే నిర్వహణ రహిత ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈఈఈ హెచ్ఓడీ పద్మలలితలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లిని అన్ని విధాల అభివృద్ధి చేస్తా

మండల సమావేశంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



గాలివీడు: అభివృద్ధి పనుల భూమి పూజ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు మండల సమస్యలను మండల అధ్యక్షులు, మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లక్కిరెడ్డిపల్లి టౌన్‌లో తహసీల్దార్ కార్యాలయంతోపాటు ఉద్యానశాఖ, ఎంపీడీఓ, ట్రెజరీ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు నూతన భవనాలను మంజూరు చేయించి పూర్తి చేయాలని కోరారు. లక్కిరెడ్డిపల్లిలో క్రీడా మైదానాన్ని కేటాయించడం జరిగిందని, త్వరితగతిన నిధులు మంజూరు చేసి షటిల్ కోర్టు ఇక్కడ మైదానం నిర్మాణం చేపట్టాలని సుదర్శన్ రెడ్డి మంత్రిని కోరారు. రైతులు తీవ్ర కరువు పరిస్థితులతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటతో పాటు ఉద్యాన పంటలైన మామిడి తోటలు ఎండిపోయి తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోవాలని కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డిలు తెలియజేశారు. గ్రామాలలో తాగు నీటి కొరత రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోందని, రోళ్ల మడుగు స్కీమ్ ద్వారా అందుబాటులో ఉన్న గ్రామాలకు తాగునీరును అందించాలని సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా లక్కిరెడ్డిపల్లి మండలానికి తాగు నీరు అందేలా చూడాలని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అల్పపీడనం ప్రభావంతో వర్షం పడుతుందని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, అలసందులు, పెసలు, మినుములు వంటి విత్తనాలను పూర్తిస్థాయిలో అందించాలని సభ్యులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సమయానికి పాఠశాలలకు చేరే విధంగా ఆర్టీసీ వారు బస్సు సౌకర్యం కల్పించాలని తెలపడంతో ఆర్టీసీ సిబ్బందికి సూచించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వర్షాలు పడి బోర్లలో నీరు చేరేవరకు సమస్యాత్మక గ్రామాలలో ట్యాంకర్లు ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. చాలా గ్రామాలలో అద్దె బిల్డింగ్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు నడుపుతున్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. దీంతో ఎక్కడెక్కడ అద్దె బిల్డింగ్‌లు ఉన్నాయో నివేదికలు తయారు చేసి పంపించాలని మంత్రి ఐసీడీఎస్ సీడీపీఓకు తెలిపారు.

తహసీల్దార్‌పై మంత్రి ఆగ్రహం

తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్నపై మండల సమావేశంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఒకింత అసహనం వ్యక్తం చేస్తూ ఆగ్రహానికి గురయ్యారు. మండలంలో ఎక్కువ సమస్యలు రెవెన్యూకు సంబంధించినవే వస్తున్నాయని, తహసీల్దార్ పట్టించుకోకుండా వ్యవహరించడంపై రైతులు, ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురావడంతో మీకు ఇష్టమైతే ఉండండి లేదంటే సెలవుపై వెళ్లండి. ఇలా ప్రజలను, రైతులను తిప్పుకోవడం పద్ధతి కాదని లక్ష్మీ ప్రసన్నపై మంత్రి మండిపడ్డారు. చాలా రోజులుగా అనేక పర్యాయాలు తహసీల్దార్ పలకలేదంటూ తన ఎదుట రైతులు, ప్రజలు మొరపెట్టుకుంటున్నారన్నారు. సమావేశం అనంతరం మంత్రి రాంప్రసాద్ రెడ్డిని స్థానిక ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు దుశ్శాలువాలతో సత్కరించి గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డన్న, మండల ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మీ, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ'

గాలివీడు : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ' కార్యక్రమం చేపడుతున్నామని రాష్ట్ర యువజన, క్రీడా, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన అరవీడు, గోరాన్ చెరువు, గాలివీడు, పూలుకుంట గ్రామ పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా గ్రామీణ ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల మెరుగుపై దృష్టి సారించిందన్నారు. గ్రామ సభల ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించి పనులు చేపడుతున్నామని చెప్పారు. వచ్చే సంక్రాంతిలోపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బలిజపల్లెలో..

చిన్నమండెం : మండలంలోని పడమటికోన గ్రామం బలిజపల్లి గ్రామంలో సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాయచోటి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

నందలూరు : అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ శంకర్ నాయక్ హెచ్చరించారు. సోమవారం అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యువకులకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదానంలో కేవలం ఆటలు మాత్రమే ఆడాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

హోంగార్డుకు సీఐ పరామర్శ

ఓబులవారిపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ హోంగార్డు రాజశేఖర్‌ను సోమవారం తిరుపతి ప్రైవేటు ఆసుపత్రిలో రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న రాజశేఖర్ దసరా పండుగ రోజు (ఆదివారం) చిట్వేలి నుండి రైల్వేకోడూరుకు వస్తూ మార్గమధ్యలో స్కూటర్‌పై నుండి అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో ముఖం, తలకు గాయాలు కాగా తిరుపతి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు పనులకు భూమిపూజ

చిట్వేలి : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రైల్వేకోడూరు పట్టణంలోని కొత్తకోడూరులో రూ. 25 లక్షలతో 440 మీటర్లు, ఓబులవారిపల్లి మండలం తల్లెంవారిపల్లిలో రూ. 5 లక్షలతో 120 మీటర్లు, కోడూరు మండలం, ఓబనపల్లిలో రూ. 20 లక్షలతో 400 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రైల్వేకోడూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



సమస్యలపై ఆరాతీస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కృషి చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రౌతుకుంట గ్రామంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కుమ్మరపల్లెలో వైఎస్సార్‌సీపీ యువనాయకుడు హరీష్‌రెడ్డి నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సమస్యలపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, నూర్‌అహమ్మద్, అమరనాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మస్తాన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు

సుండుపల్లె : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని మండల వలంటీర్లు సోమవారం ఎంపీడీఓ సుధాకర్ రెడ్డికి ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ప్రచారంలో వలంటీర్ వ్యవస్థ కొనసాగుతుందని, వలంటీర్ల గౌరవ వేతనం రూ. 5 వేలు నుండి రూ. 10 వేలు పెంచుతానని చెప్పి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఇంతవరకు తమకు ఎటువంటి జీత భత్యాలు ఇవ్వలేదన్నారు. వెంటనే తమకు నాలుగు నెలల జీతభత్యాలు చెల్లించి తమను కొనసాగించి ఉద్యోగ భద్రతను కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు దేవిక, అపర్ణ, జ్యోతి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన అవసరం



ఖాతాదరులకు అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్, డీఎంలు

సుండుపల్లె : మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంక్ లావాదేవీలపై బ్రాంచ్ మేనేజర్ మస్తాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎం షఫీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1906వ సంవత్సరంలో సుబ్బారావు కెనరా బ్యాంక్‌ను స్థాపించారని, ఈ బ్యాంక్ ద్వారా ఖాతాదారులు ఎడ్యుకేషన్ లోన్‌లు, వాహనాల లోన్లు, వ్యాపారాలకు లోన్లు పొందవచ్చని తెలిపారు. మహిళలకు జీరో అకౌంట్, సేవింగ్స్ అకౌంట్లతపాటు ఏజెంల్ అకౌంట్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అకౌంట్ ద్వారా మహిళలకు క్యాన్సర్ వ్యాధి చికిత్సకు రూ.10 లక్షలు వరకు లబ్ధి పొందవచ్చని తెలిపారు. అలాగే ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా ద్వారా రూ. 430లు చెల్లిస్తే బీమాదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు వరకు వెంటనే లబ్ధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సిమ్మి, లిటిల్ ఫ్లవర్ స్కూల్ నాగేశ్వర, బాబు రెడ్డి, వెలుగు ఆఫీస్ యానిమేటర్లు, కెనరా బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మరో మూడు రోజులపాటు భారీ వర్ష సూచన
- రాజంపేటలో తోటలను పరిశీలించి సలహాలిచ్చిన ఉద్యాన అధికారి
- పంట కోత చేపట్టవద్దంటూ సూచన
- వర్షాలు తగ్గాక చేయాల్సిన చర్యల వివరణ



రాజంపేట రూరల్: వెంకటరాజంపేటలో అరటి పంటను పరిశీలిస్తున్న సురేష్‌బాబు

రాజంపేట రూరల్ : అధిక వర్షాలకు అరటి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు కోరారు. మండల పరిధిలోని పోలి, మందరం, ఊటుకూరు, వెంకటరాజంపేట, అప్పరాజుపేట, సీతారామపురం గ్రామాలలోని అరటి పంటను సోమవారం సురేష్‌బాబు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. మాట్లాడుతూ వర్షం ఆగిన తర్వాత సాధ్యమైనంత త్వరగా వరద నీటిని తోట నుంచి వెలుపలకు పంపి భూమి ఆరే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నేల ఆరిన తర్వాత గొర్రుతో అంతర సేద్యం చేసి ప్రతి మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్‌లను 25 రోజులలోపు 3 పర్యాయాలు వేయాలని కోరారు. అధిక తేమ కారణంగా సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు ప్రోపికోనజోల్ 1మి.లి లీటర్ నీటిలో కలిపి జిగురు మంతో పిచికారీ చేయాలని తెలియజేశారు. దుంప కళ్లు ఆశించిన మొక్కలను గుర్తించి 25 గ్రాముల బ్లీచింగ్ పౌడర్ లీటర్ నీటిలో కలిపి మొదలు తడిచేలా పోయాలని తెలియజేశారు. అదే విధంగా ముంపు నీరు పోయిన వెంటనే ఆకులు, గెలలు తడిచేలా 13.0.45 లేదా 0.0.50ను 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 3 రోజుల వ్యవధిలో 3 పర్యాయాలు పిచికారీ చేయాలని కోరారు. ఆకులు, లేత గెలలపై 5 గ్రాముల సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటర్ నీటిలో జిగురు మందుతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ కె.పూర్ణచంద్ర, రైతులు పాల్గొన్నారు.

మూడు రోజులు పంట కోతలు వద్దు

చిన్నమండెం/రాజంపేట రూరల్/సిద్దవటం/సుండుపల్లె : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఈ నెల 17వ తేదీ వరకు వర్షాలుంటాయని వాతావరణ శాఖ తెలియజేసింది. ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలియజేయడంతో వ్యవసాయ అధికారులు అప్రమత్తం అయ్యారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో పంట కోత పనులు చేపట్టవద్దని ఆయా మండలాల వ్యవసాయ అధికారులు గీత, గుజ్జల రాజకుమారి, కె.రమేష్‌రెడ్డి, సుండుపల్లె వ్యవసాయ సహాయకులు మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అధిక తేమ వల్ల పంట దెబ్బతినే అవకాశం ఉందని తెలియజేశారు. పొలంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా తడిచిన పంటకు వర్షం ఆగిన తర్వాత ఉప్పు ద్రావణంను పిచికారీ చేయడం వలన పంట దెబ్బ తినకుండా కాపాడుకోవచ్చని తెలియజేశారు. అలాగే ప్రతి రైతుసేవా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు.

ప్రభావం చూపుతున్న అల్పపీడనం

- అన్ని మండలాల్లో ఎడతెరిపిలేని వర్షం
- పలుచోట్ల జలమయం
- రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు



రాజంపేట: తిరుపతి రోడ్డుపై చేరిన నీటిని దారిమళ్లిస్తున్న మున్సిపల్ సిబ్బంది



పెనగలూరు: జోరు వానలో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

రాజంపేట : రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజామున నుంచి జడివాన పట్టుకుంది. పలుచోట్ల నీటిమయమయ్యాయి. రోడ్లన్నీ నీటి గుంతలు ఏర్పడ్డాయి. జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. కాగా 14, 15, 16 తేదీలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల శాఖ నుంచి సూచనలు వచ్చాయని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ వైదియాదేవి తెలిపారు. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ముందు జాగ్రత్తలతో ప్రాణ, పశునష్టం జరగకుండా చూసుకోవచ్చునన్నారు. రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో 08565 – 240079ను కంట్రోలు రూం ఏర్పాటు చేశామన్నారు.

యుద్ధప్రాతిపదకన చర్యలు..

రాజంపేట పట్టణంలో సోమవారం కురిసిన వర్షాలకు ఎలాంటి సమస్యలు లకేండా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. వర్షపునీరు, డ్రైనేజీ నీరు మిళితమై రోడ్లపై ప్రవహించాయి. కొన్ని చోట్ల వర్షపునీటి నిల్వతో ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. తిరుపతి రోడ్డులోని వజ్ర కల్యాణమండం సమీపంలో రోడ్డు మీద ప్రవహించడంతో మున్సిపాలిటీ యుద్ధప్రాదిపదికన జేసీబీ సహాయంతో నీటిని దారిమళ్లించారు. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో జోరుగా కురుస్తున్న వర్షం వల్ల సమస్య ఉత్పన్నమైన వెంటనే మున్సిపాలిటీ సిబ్బంది సకాలంలో స్పందిస్తున్నారు. మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి పట్టణంలో వర్షంకారణంగా ఎటువంటి సమస్య వచ్చిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు : మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. 40 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాదికి మండలంలో ఇదే పెద్ద వర్షపాతంగా నమోదు కావడం విశేషం. ఇప్పటికే వర్షాలు లేక బోర్లు ఎండిపోయి కొన్ని ప్రాంతాలలో వరిపంట దెబ్బతింది. సోమవారం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండల కేంద్రంలోని ఇండ్లూరు బస్టాండ్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉదయం కురిసిన వర్షానికి కాలిపోయింది. దీంతో ఇండ్లూరు గ్రామమంతా విద్యుత్ లేక ప్రజలు ఇబ్బంది పడుతుండగా విషయం తెలుసుకున్న ఏఈ షఫీ రాజంపేట నుంచి తమ సిబ్బంది ద్వారా వర్షంలోనే కొత్త ట్రాన్స్ఫార్మర్ తెచ్చి బిగించారు.

ఎడతెరిపిలేని వర్షం

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేకుండా ఓ మోస్తరు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. వర్షం కురుస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు ఏఎస్ఓ కీర్తి తెలిపారు.

పుల్లంగేరు పరిశీలన

పుల్లంపేట : ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుల్లంపేట తహసీల్దార్ అరవింద కిషోర్ అన్నారు. సోమవారం బోటుమీదపల్లి సమీపాన ఉన్న పుల్లంగేరును పరిశీలించారు. ప్రజలు ఎవరూ బయటకు రావద్దని, వాగులు, వంకలు వద్దకు వెళ్లరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: మోస్తరు వర్షంతో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



పుల్లంపేట: బోటుమీదపల్లి వద్ద పుల్లంగేరును పరిశీలిస్తున్న తహసీల్దార్ అరవింద కిషోర్


చౌడేశ్వరమ్మకు పూజలు



పూజలందుకుంటున్న చౌడేశ్వరమ్మ

వీరబల్లి : మట్లి పంచాయతీలోని తొకటపల్లిలో సోమవారం చౌడేశ్వరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు అక్కడికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగింది. అదేరోజు రాత్రి అమ్మవారిని పురవీధులలో ఊరేగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పెన్నా నదిలో ఎవరూ దిగవద్దు



ఎస్ఐ చిరంజీవి

సిద్దవటం : అల్పపీడన ప్రభావంతో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ పెన్నా నదీ పరీవాహక ప్రాంతాలైన వెంకటాయపల్లె, పి.కొత్తపల్లి, జ్యోతి గొల్లపల్లి, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, సిద్దవటం, జంగాపల్లె, వెలుగుపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె, టక్కోలు, మాచుపల్లె మూలపల్లె, సంటిగారిపల్లె గ్రామాల ప్రజలు పెన్నా నదిలోకి ఎవరూ దిగకూడదన్నారు. పెన్నా నదిలో సుడిగుండాలు గుంతలు ఉన్నాయని పెన్నానదిలోకి దిగి ప్రమాదాలను తెచ్చుకోవద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమించి పెన్నానదిలోకి దిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల ఇద్దరు పెన్నానదిలోకి దిగి మృత్యువాత పడ్డారన్నారు. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలని తెలిపారు.

వేడుకగా ఆలయ పునఃప్రతిష్టాపనోత్సవాలు

రామాపురం : మండల పరిధిలోని నీలకంఠరావుపేటలో నూతనంగా పున:నిర్మించబడిన శ్రీ రామ దూత అభయహస్త ఆంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి బుధవారం వరకు హనుమాన్ ధ్వజ, శిఖర ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ ఆలయంలో గత మూడు శతాబ్దాలకు పైబడి కొంత భాగం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన దేవదాయ శాఖ అధికారులతో సంప్రదించి నిధుల విడుదలకు కృషి చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం మహాగణపతి పూజ, స్వస్తిహవాచనం, అంకురార్పన ఇతరత్రా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం అభిషేకాలు, యంత్రపూజ, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్య నిర్వహణ మండల సభ్యులు రామసుబ్బారెడ్డి గ్రామస్తులు తెలిపారు.

ట్రెక్కింగ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు



విద్యార్థికి ధృవపత్రాన్ని అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

చిట్వేలి : ఈనెల 4వ తేదీ నుండి 11వ తేది వరకు అరకు లోయలో జరిగిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ యాత్రలో ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్, ఎన్‌సీసీ క్యాడెట్ రేవూరి దినేష్‌లు పాల్గొన్నారని ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో వారిని అభినందించి ధృవపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ సాహస కృత్యాలలో భాగంగా ఆల్ ఇండియా ట్రెక్కింగ్‌లో ఎన్‌సీసీ విద్యార్థి దినేష్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ డీడీజీ ఎయిర్ కమాండో వీఎం రెడ్డితో కలిసి ట్రెక్కింగ్ చేయడం తమకెంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని కల్గించిందన్నారు. ట్రెక్కింగ్‌తోపాటు క్విజ్, పోస్టర్ మేకింగ్, ఎలక్యూషన్, కల్చర్ తదితర కాంపిటీషన్‌లలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని కల్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో అంకురార్పణ కార్యక్రమం సోమవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు మూలవర్లకు అభిషేకం, 7గంటలకు అలంకరణ, తోమాలసేవ, పంచాంగశ్రవణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితల మంత్రోచ్ఛరణల నడుమ అంకురార్పణ కన్నులపండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అలయ అర్చకులు కృష్ణరాజ్‌భట్టర్, బాషికాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.